నేనే ఎమ్మెల్యే అయితే..

గోదావరి నదీకోత నివారణకు కార్యాచరణ



విప్పర్తి వేణుగోపాలరావు

మామిడికుదురు: పి.గన్నవరం నియోజకవర్గంలో జటిలంగా ఉన్న గోదావరి నదీకోత నివారణకు కార్యాచరణ చేపడతానని వైఎస్సార్ సీపీ అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు స్పష్టం చేశారు. ఇరిగేషన్ శాఖలో పని చేసిన అనుభవంతో ఈ సమస్య పరిష్కారం దిశగా ముందుకు వెళ్తానన్నారు. తీర గ్రామాలతో విస్తరించిన నియోజకవర్గ రైతులను నదీకోత సమస్య తీవ్రంగా వేధిస్తుందన్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం రివిట్‌మెంట్ నిర్మాణంతో పాటు గ్రోయిన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానన్నారు. నియోజకవర్గం ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తానన్నారు. రహదారుల అభివృద్ధి, డ్రైన్ల నిర్మాణం వంటి ప్రాథమిక అంశాలపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరిస్తానని చెప్పారు. జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి గ్రామానికి తాగునీరు అందించి ఈ సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరిస్తానని వేణుగోపాలరావు స్పష్టం చేశారు. వీటితో పాటు ప్రాధాన్యతా క్రమంలో సమస్యలను పరిష్కరిస్తానని చెప్పారు.

దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరిస్తా : గొల్లపల్లి



గొల్లపల్లి సూర్యారావు

మలికిపురం: తాను ఎమ్మెల్యేనైతే రాజోలు నియోజకవర్గంలో దీర్ఘకాలికంగా ఉన్న ప్రజా సమస్యలను పరిష్కారిస్తానని రాజోలు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. ప్రధానంగా తీరప్రాంత గ్రామాల్లో నివాస గృహాలకు ఇంటింటికీ తాగునీటి కుళాయిల నిర్మాణం పూర్తి చేస్తాను. కాలనీలలో ప్రతి వీధికి సీసీ రోడ్డు వేయిస్తాం, అలాగే డ్రైనేజీ సౌకర్యం సక్రమంగా లేక సాగుకు దూరమైన భూములను సాగులోకి తెచ్చేందుకు డ్రైనేజీ సౌకర్యం కల్పిస్తాం. గిట్టుబాటు ధరలేక సతమతం అవుతున్న సరుగుడు సాగు రైతులకు మెరుగైన ధర కల్పిస్తాం. ఇప్పటికే నిధులు మంజూరైన సఖినేటిపల్లి-నర్సాపురం (రాజుల్లంక- రామేశ్వరం) వంతెన నిర్మాణం, బైపాస్ రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేయిస్తా. ఈ పనులకు ఇప్పటికే రూ.580 కోట్లను సీఎం జగన్ మంజూరు చేశారు. సఖినేటిపల్లి మండలం గొంది నుంచి రాజోలు మండలం పొదలాడ వరకూ గల గోదావరి నదీ తీరం వెంబడి కోత నివారణకు చర్యలు తీసుకుని విలువైన కొబ్బరి తోటల రక్షణ చేపట్టి రైతులను, భూములను రక్షస్తాం. వరద ప్రభావిత ప్రాంతాలలో శాశ్వత రక్షణ చర్యలు చేపడతాం. రాజోలు నియోజక వర్గంలో తీవ్ర సమస్యగా ఉన్న శంకరగుప్తం డ్రైన్ ముంపు సమస్యల పరిష్కారానికి రక్షణ గోడ నిర్మాణంతో పాటు ఇతర చర్యలు తీసుకుని ఇక్కడ గల వేలాది ఎకరాల కొబ్బరి తోటలను కాపాడతాం.

క్లుప్తంగా

26న ఆదుర్రులో బౌద్ధ సాంస్కృతిక ఉత్సవాలు

మామిడికుదురు: ఆదుర్రు ప్రాచీన ఆది బౌద్ధ స్తూపం వద్ద ఈ నెల 26న ప్రాచీన భారతీయ వారసత్వ బౌద్ధ సాంస్కృతిక ఉత్సవాలు ఏర్పాటు చేశామని ఆదర్రు బుద్ధ విహార్ ట్రస్టు కార్యదర్శి ఎస్‌ఎస్‌ఆర్ భూపతి తెలిపారు. ఆదుర్రులో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మీరట్‌కు చెందిన పూజ్య భిక్షు డాక్టర్ నాగ భూషణ కొండయ్య సారథ్యంలో జయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహిస్తామన్నారు.

బ్రాహ్మణుల అభివృద్ధికి కృషి

మలికిపురం: రాష్ట్రంలో పేద బ్రాహ్మణుల అభివృద్ధికి సీఎం జగన్ కట్టుబడి ఉన్నారని రాజోలు వైఎస్సార్ సీపీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. శుక్రవారం మండలంలోని విశ్వేశ్వరాయపురంలో జెడ్పీటీసీ బల్ల ప్రసన్నకుమారి కార్యాలయం వద్ద జరిగిన మండల స్థాయి బ్రాహ్మణుల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. బ్రాహ్మణులంతా జగన్ వెంటే ఉంటామని వారు పేర్కొన్నారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, కేఎస్ఎన్ రాజు, బల్ల రత్నరాజు, గుబ్బల వీవీ సత్యనారాయణపాల్గొన్నారు.

ఎన్నికల వేళ... స్లిప్పుల గోల

అంబాజీపేట: సార్వత్రిక ఎన్నికలకు గడువు సమీపిస్తుండటంతో మండలంలోని అన్ని గ్రామాల్లో హడావుడి మొదలైంది. ఎవరికి వారు సన్నద్ధం అవుతున్నారు. కార్యకర్తల నుంచి అధికారులు సైతం వారి వారి విధుల్లో నిమగ్నమయ్యారు. ఆయా పార్టీల కార్యకర్తలు విధుల్లో తిరుగుతూ ఓటరు జాబితా ప్రకారం తనిఖీ చేసి స్లిప్‌లను అందిస్తున్నారు. ఓటర్లు ఓటింగ్ రోజున వారికి ఉపయోగపడే ఓటరు స్లిప్పుల కోసం ఎగబడుతున్నారు. ఓటరు స్లిప్పు ఉందా లేదా. అని ఎగబడి మరీ తీసుకుంటుండటంతో అప్పుడే ఎన్నిక వచ్చినట్లుయింది.

అనుమతి లేకుండా కూటమి భారీ ర్యాలీ

మలికిపురం: రాజోలు నియోజకవర్గంలో టీడీపీ-జనసేన కూటమి శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించింది. ఆ పార్టీ శ్రేణులు ఎటువంటి అనుమతులు తీసుకున్న దాఖలాలు లేవు. సరైన పోలీసు బందోబస్తు కూడా ఇక్కడ లేదు. వందలాది మంది టీడీపీ-జనసేన కార్యకర్తలు ఒక్కసారిగా రోడ్డుపైకి వచ్చి బీభత్సం సృష్టించారు. దీంతో శాంతి భద్రతల సమస్య కూడా ఏర్పడింది. పర్యవసానంగా విశ్వేశ్వరాయపురంలో ఒక వ్యక్తిపై దాడి జరిగింది.

హ్యాట్రిక్ దిశగా ఫ్యాన్ స్పీడ్

- చిరకాల ప్రత్యర్థుల మధ్యే పోటీ
- సీఎం జగన్ సంక్షేమం, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ప్రజాసేవ వైపు జనం మొగ్గు
- ప్రచారం.. ప్రసంగాల్లో ప్రజలను ఆకట్టుకుంటున్న జగ్గిరెడ్డి



కోవిడ్ సమయంలో శానిటేషన్ సిబ్బందితో కలిసి స్ప్రే-చేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి (ఫైల్)

కొత్తపేట: రాజకీయ చైతన్యానికి నిలయమైన కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గంలో చిరకాల ప్రత్యర్థుల మధ్య పోటీ జరుగుతుంది. ఇక్కడ అధికార వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, ప్రతిపక్ష టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తలపడుతున్నారు. వీరిద్దరూ 2004 ఎన్నికల నుంచి ప్రత్యర్థులుగా పోటీ పడుతున్నారు. జగ్గిరెడ్డి 2004 నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో అడుగుపెట్టి గత ఎన్నికల వరకూ 4 సార్లు పోటీ చేసి (2009లో మినహా) 3 సార్లు (2004, 2014, 2019) విజయం సాధించారు. 1989 ఎన్నికల్లో అడుగు పెట్టిన బండారు ఆ ఎన్నికల్లో డాక్టర్ చిర్ల సోమసుందరరెడ్డి చేతిలో ఓటమి చవిచూడగా 1994, 99 ఎన్నికల్లో డాక్టర్ చిర్ల సోమసుందరరెడ్డిపైన, 2009 ఎన్నికల్లో చిర్ల జగ్గిరెడ్డిపైన విజయం సాధించారు. ఆ విధంగా బండారు ఏడుసార్లు పోటీ చేసి 3 సార్లు గెలవగా, 8వ సారి బరిలో నిలిచారు. జగ్గిరెడ్డి 4 సార్లు పోటీ చేసి 3 సార్లు విజయం సాధించగా ఐదో సారి పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. ఈసారి కూడా జగ్గిరెడ్డి గెలిస్తే వరుస విజయాలతో హ్యాట్రిక్ రికార్డును కైవసం చేసుకుంటారు.

ఐదేళ్లలో రూ.2,935 కోట్లతో సంక్షేమం, అభివృద్ధి

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన మరుక్షణం నుంచే పథకాలు అమలు చేసి, నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే నగదు జమ చేయడం ప్రారంభించింది. కొత్తపేట నియోజకవర్గ చరిత్రలోనే గతంలో ఎన్నడూ లేని విధంగా గడచిన ఐదేళ్ల వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రజా సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారు. జిల్లాలోనే ఏ నియోజకవర్గంలో లేని విధంగా కొత్తపేట నియోజకవర్గానికి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు అత్యధిక స్థాయిలో నిధులు కేటాయింపు జరిగింది. ఈ విషయంలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి కృషి ఎంతో ఉంది. అర్హులైన ఏ ఒక్కరికీ అన్యాయం జరక్కుండా చూడాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశిస్తుండేవారు. దాంతో 25 సంక్షేమ పథకాలకు సంబంధించి ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా సుమారు రూ.1,450 కోట్లు, 8 పథకాలకు సంబంధించి పరోక్ష నగదు బదిలీ ద్వారా సుమారు రూ.735 కోట్లు, వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సుమారు రూ.750 కోట్లు ఖర్చు చేశారు. దాంతో కుల, మత, పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల్లో ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాల్లో వివిధ పథకాలు పొందిన మహిళలు, పురుషులు, వృద్ధులు, దివ్యాంగులు, యువకులు, రైతులు, విద్యార్థులు, వివిధ కుల వృత్తుల వారు వైఎస్సార్ సీపీ ఫ్యాన్ వైపు మొగ్గు చూపుతున్నారు. అన్నింటికీ మించి తాత, పంచాయతీ సమితి మాజీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, తండ్రి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సోమసుందరరెడ్డి వారసత్వాన్ని, వారి సేవా దృక్పథాన్ని పుణికిపుచ్చుకుని రాజకీయరంగ ప్రవేశం చేసిన ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ప్రజాసేవకే అంకితమయ్యారని అనడంలో అతిశయోక్తి కాదు. నియోజకవర్గంలో ఎవరికి ఏ ఆపద వచ్చినా, ఏ ప్రమాదం సంభవించినా వెంటనే వెళ్లి ఆదుకునే మనస్తత్వం జగ్గిరెడ్డిది. ఏదైనా అవసరం కోసం ఆయనను ఆశ్రయిస్తే కాదనకుండా వెంటనే స్పందించి, ఆ అవసరం తీర్చడం ఆయన నైజం. అందుకే ఈ నియోజకవర్గంలో మైనార్టీ సంఖ్యాక వర్గానికి చెందిన కుటుంబ అయినప్పటికీ అన్ని గ్రామాల్లోనూ తండ్రి సోమసుందరరెడ్డి హయాం నుంచీ తండ్రీ, తనయులకు అత్యధిక సంఖ్యలో అభిమానులున్నారు. ప్రత్యేక ఓట్ బ్యాంక్ ఉంది. అలా ఈసారి కూడా జగ్గిరెడ్డి సేవా దృక్పథంపై, ఈ ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల లబ్ధిపై విశ్వాసం ప్రజల్లో స్పష్టంగా కనిపిస్తుంది.

గ్రామ గ్రామాన వైఎస్సార్ సీపీ ప్రభావం

ప్రధాన ప్రత్యర్థులైన జగ్గిరెడ్డి, బండారు ఇద్దరి పనితీరులో ప్రజలు జగ్గిరెడ్డి పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జగ్గిరెడ్డి ప్రచారంలో దూసుకుపోతూ ఐదేళ్లలో సంక్షేమ పథకాలు, ప్రజాసేవకు అంకితమైన తన కుటుంబం గురించి, తన పనితీరును వివరిస్తూ, ప్రతిపక్ష నేత అవినీతిని తనదైన శైలిలో ఎండగడుతూ ప్రజలను ఆకర్షిస్తున్నారు. దాంతో ఎక్కడికక్కడ ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తుంది. ఆయన తరపున పార్టీ శ్రేణులు, అభిమానులు గ్రామాల్లో ఇంటింటా ప్రచారం చేసి ఓట్లు అభ్యర్థిస్తుంటే, పథకాలు అందుకున్నాం.. మా ఓటు ఫ్యాన్‌కే అంటూ మాటిస్తున్నారు. టీడీపీ అభ్యర్థి బండారుకు ప్రజల నుంచి ఆశించినంత మద్దతు లభించడం లేదు. జనసేన నుంచి పూర్తి స్థాయిలో మద్దతు కరువైంది. జగన్ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రభావంతో నియోజకవర్గ వ్యాప్తంగా అనేక గ్రామాల్లో టీడీపీ, జనసేన క్యాడర్, అభిమానులు వైఎస్సార్ సీపీకి వలస వచ్చారు. దాంతో టీడీపీ బలహీనమై, వైఎస్సార్ సీపీ బలోపేతమైంది. ఈ విధంగా కొత్తపేట నియోజకవర్గంలో ఈసారి కూడా జగ్గిరెడ్డికే విజయాకాశాలు కనిపిస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి..

కోవిడ్ సమయంలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి సేవలు విమర్శకుల నుంచి సైతం ప్రశంసలు అందుకున్నాయని విశ్లేషకులు అన్నారు. కోవిడ్ క్లిష్ట పరిస్థితుల్లో ప్రతిపక్ష టీడీపీ అభ్యర్థి బండారు సత్యానందరావు జాడే లేదని పేర్కొన్నారు. జగ్గిరెడ్డి కోవిడ్ బారిన పడినా లెక్కచేయకుండా కోవిడ్ బాధితులకు, కోవిడ్ రాకుండా ముందు జాగ్రత్తలకు సంబంధించి సేవలందించారు. ఆక్సిజన్ కొరత రాకుండా చర్యలు తీసుకుని సరఫరా చేయించారు. కాల్ సెంటర్‌లు పెట్టారు. ప్రత్యేక ట్యాంకర్లు పెట్టి గ్రామాల్లో శానిటేషన్ చేయించారు. ప్రత్యేకంగా ఒక అంబులెన్స్ సమకూర్చారు. ప్రాణాలకు తెగించి కోవిడ్ వార్డుల్లోకి సైతం వెళ్లి బాధితులను పరామర్శించి, పౌష్టికాహారం కిట్లు అందించి, అధైర్య పడకండి.. అంటూ ధైర్యం చెప్పారు. గ్రామ గ్రామాన ప్రజలకు ఉచితంగా మందుల కిట్లు, నిత్యావసర సరుకుల కిట్లు, కూరగాయలు, కోవిడ్ బాధితులకు మందుల కిట్లు పంపిణీ చేశారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా నిత్యం గ్రామాల్లో తిరుగుతూ, వైద్యులు, వైద్య సిబ్బంది, అధికారులను అప్రమత్తం చేస్తూ స్వయంగా వివిధ సేవలందించారు.

జగనన్నకు మళ్లీ పట్టం కడదాం



వానపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

కొత్తపేట: మాదిగలను గుర్తించిన వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి మళ్లీ పట్టం కట్టాలని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ పిలుపునిచ్చారు. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలోని వైఎస్సార్ సీపీ అభ్యర్థుల తరఫున ప్రచారంలో భాగంగా శుక్రవారం సాయంత్రం కొత్తపేట మండలం వానపల్లి, ఖండ్రిగ గ్రామాల పరిధిలోని మాదిగల పేటల్లో విస్తృతంగా పర్యటించి సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాదిగా రాజకీయ పార్టీలు మాదిగలను ఓటు బ్యాంకుగా వాడుకోవడం తప్ప మాదిగలను గుర్తించింది లేదన్నారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భవించాకే ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాజకీయంగా మాదిగలను గుర్తించారని, ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాజ్యాంగ పదవుల్లో, నామినేట్ పదవుల్లో ప్రత్యేక కోటా కల్పించారన్నారు. అటువంటి పార్టీని, ఆ పార్టీ నేతను మన జాతి మర్చిపోకూడదన్నారు. ఇక్కడ ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న చిర్ల జగ్గిరెడ్డిని, ఎంపీగా పోటీ చేస్తున్న రాపాక వరప్రసాద్‌ను బలపర్చి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా, మండల మాదిగ సంఘ నాయకులు, పెద్దలు చేట్ల సత్యనారాయణ, చేట్ల రామారావు, సిద్దుల కృపవర్మ, కముజు బాబి, నేదునూరి సత్యం, సిద్దుల ఎన్‌వీ సత్యనారాయణ, ఉండ్రాజవరపు సత్యనారాయణ, రాయి అన్నవరం, ఆకుమర్తి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

వాడపల్లి పుణ్యక్షేత్రానికి జగ్గిరెడ్డి పాదయాత్ర



ఊబలంక రోడ్డులో వాడపల్లికి పాదయాత్రగా వెళుతున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి

ఎన్నికల్లో విజయాన్ని కాంక్షిస్తూ వాడపల్లికి కాలినడక

రావులపాలెం: జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయఢంకా మోగించి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి రావాలని, అలాగే తాను ఎమ్మెల్యేగా గెలవాలని కాంక్షిస్తూ జగ్గిరెడ్డి వాడపల్లికి పాదయాత్ర చేపట్టారు. శుక్రవారం ఉదయం రావులపాలెంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయానికి చేరుకున్నారు. స్థానిక భక్తాంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించి అక్కడ నుంచి రింగ్ రోడ్డు మీదగా ఊబలంక వైపు పాదయాత్ర సాగించారు. వేలాదిగా చేరుకున్న వైఎస్సార్ సీపీ అభిమానులు, కార్యకర్తలు, జగ్గిరెడ్డి అభిమానులు ఆయన వెంట పాదయాత్రలో ముందుకు సాగారు. దారి పొడవునా ప్రజలకు అభివాదం చేసుకుంటూ వాడపల్లికి పాదయాత్ర చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, కొత్తపేట ఎంపీపీ మార్గాన గంగాధరరావు, వాడపల్లి దేవస్థానం చైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు, మాజీ వైస్ ఎంపీపీ దండు సుబ్రహ్మణ్యం వర్మ, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కర్రి వీర్రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పమ్మి చంటి, బాలు, పులగుర్త రామారావు, దంగేటి మాణిక్యాలరావు, వంగలపూడి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన శెట్టిబలిజలు

నమ్మి ఓటు వేసే ప్రజలకు మంచి చేసే నాయకులతోనే మేము ప్రయనిస్తామని గ్రామంలోని ఊబలంక రోడ్‌లోని శెట్టిబలిజ రామాలయం ఏరియా శెట్టిబలిజలు అన్నారు. శుక్రవారం ఆ ప్రాంతంలోని పలువురు వైఎస్సార్ సీపీలో చేరారు. వాసంశెట్టి వెంకటేశ్వరరావు, రాయుడు ప్రసాద్, గుత్తుల సూర్యనారాయణ, సూరంపూడి వెంకటేష్, కుడుపూడి చంటి, గుత్తుల మురళీకృష్ణ, గుత్తుల ప్రవీణ్, సూరంపూడి సాయిరామ్, గుత్తుల వీరేంద్ర, కర్రి మహేష్ రెడ్డి, నున్నబోయిన ధనరాజు, వాసంశెట్టి వంశీకృష్ణ, రెడ్డి సుకుమార్, గెద్దాడ జయరాజు, వాసంశెట్టి సనత్ కుమార్ తదితరులు వైఎస్సార్‌సీపీ కొత్తపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. వారికి చిర్ల జగ్గిరెడ్డి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

జగన్ రెండోసారీ ముఖ్యమంత్రి కావడం ఖాయం



పి.గన్నవరంలో విప్పర్తిని సత్కరిస్తున్న నర్సింహరాజు



మొండెపులంకలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు

పి.గన్నవరం: ఈనెల 13న జరుగనున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండో సారి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టడం ఖాయమని పి.గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. మండలంలోని మొండెపులంక, పెదకందాలపాలెం గ్రామాల్లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలను కలుసుకుని ఫ్యాన్ గుర్తుకు ఓట్లేసి వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. సంక్షేమ పథకాల అమలు కొనసాగాలంటే వైఎస్సార్ సీపీని గెలిపించాలని అన్నారు. అనంతరం పెదకందాలపాలెం ఎన్‌జేఎం చర్చిలో విప్పర్తి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే నియోజకవర్గ జేసీఎస్ కన్వీనర్ విప్పర్తి రామ్మోహన్‌రావు, ఆయన సతీమణి జెమీమా రోజ్‌లు పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమాల్లో నాయకులు కొక్కిరి రవి కుమార్, అడ్డగళ్ల శ్రీను, కొల్లాటి వెంకట్రావు, తోలేటి నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విప్పర్తికి గజమాలతో సత్కారం

ప్రజా సంక్షేమంతో పాటు, రాష్ట్రాభివృద్ధి సీఎం జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమని పి.గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఇందుకూరి నర్సింహరాజు శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విప్పర్తిని గజమాలతో సత్కరించారు. ఈసందర్భంగా విప్పర్తి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు పలుకుతున్నారని అన్నారు. పి.గన్నవరంలో విప్పర్తి విజయం ఖాయమని, అందుకే ముందుగా ఆయన్ను సత్కరించినట్టు నర్సింహరాజు తెలిపారు. మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, నాయకులు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, విప్పర్తి రామ్మోహన్‌రావు, కొక్కిరి రవికుమార్, కుడుపూడి రాము, నాగాబత్తుల యువరాజు, దొమ్మేటి సూర్య, అడ్డగళ్ల శ్రీను, పుచ్చకాయల రాజు, జక్కంపూడి వాసు తదితరులు పాల్గొన్నారు.

దగ్ధమైన తాటాకిల్లు

ఆలమూరు: మండలంలోని మడికి శివారు నాగుల పేటలో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గోంపా మాలిబాబు, కొండమ్మ దంపతులకు చెందిన పూరిగుడిసె నుంచి హఠాత్తుగా మంటలు వెలువడ్డాయి. స్థానికులు సంఘటన స్థలానికి చేరుకుని మంటల అదుపు చేసేలోపే పూరిగుడిసె పూర్తిగా దగ్ధమైంది. ఆ సమయంలో కుటుంబ సభ్యులు ఇంట్లో లేకపోవడంతో ప్రాణపాయం తప్పింది. షార్ట్ సర్క్యూట్ ఈ ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. అగ్నిప్రమాదంలో సుమారు రూ.లక్ష వరకూ ఆస్తి నష్టం సంభవించి ఉంటుందని స్థానికులు అంచనా వేస్తున్నారు.

పారిశుధ్య చర్యలు పాటించాలి

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పేందు వీలుగా ప్రతి శుక్రవారాన్ని పొడి వారం (డ్రైడే)గా పాటించి సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి కోరారు. ఫ్రైడే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. రుబ్బురోళ్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ సీసాలు, వ్యర్థాలను ఇంట్లో ఉండకుండా చూడాలని మహిళలకు సూచించారు. దీనివల్ల క్రిమికీటకాలు దరి చేరవని, తద్వారా అంటువ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉండదన్నారు.

జనసేన, టీడీపీ అల్లరి మూకల దాడి అమానుషం



రాజోలులో మాట్లాడుతున్న రాపాక, గొల్లపల్లి, రాజేశ్వరరావు

రాజోలు: విశ్వేశ్వరాయపురంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ కార్యకర్త జిల్లెళ్ల గౌతమ్‌పై జనసేన, టీడీపీ అల్లర మూకలు చేసిన దాడి అమానుషమని రాజోలు అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. శుక్రవారం జనసేన, టీడీపీ అల్లరిమూకల దాడిలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గౌతమ్‌ను గొల్లపల్లి సూర్యారావుతో పాటు అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ మాజీ కో-ఆర్డినేటర్ బొంతు రాజేశ్వరరావు పరామర్శించారు. ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ ర్యాలీలో బైక్ సైలెన్సర్లు తీసేసి అల్లరిమూకలు చేసిన వికృత చేష్టలకు ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారన్నారు. దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు, సర్పంచ్ రేవు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

హోరెత్తిన ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం



ఆత్రేయపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి


ఆత్రేయపురం: మండలంలోని ఆత్రేయపురం, వద్దిపర్రు గ్రామాల్లో ఎమ్మెల్యే అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి ఎన్నికల ప్రచారం హోరెత్తించారు. సీఎం జగన్ ప్రభుత్వంలో అర్హత ఉన్న ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించామని, గ్రామ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా అవినీతి తావు లేకుండా సంక్షేమ పథకాలు నేరుగా ప్రతి గడపకు అందించామన్నారు. గత పాలకులా ప్రజలను మోసం చేయకుండా సంక్షేమం, అభివృద్ధి చేసి చూపించామన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి మరలా అఖండ మెజార్టీతో గెలిపించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరలా సీఎంగా చేసుకోవాలని, ఎన్నికల తరువాత ఇచ్చిన హామీలను మర్చిపోయే పార్టీలను నమ్మి మోసపోవద్దని జగ్గిరెడ్డి అభ్యర్థించారు. జగనన్న ప్రభుత్వంలో ప్రతి గ్రామంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పనిచేసి చూపించామన్నారు. ప్రజలు జరిగిన మంచిని గమనించి మంచి చేసే జగనన్న ప్రభుత్వానికే మరలా పట్టం కట్టాలని చిర్ల జగ్గిరెడ్డి కోరారు. తొలుత ఆత్రేయపురం గ్రామంలో శ్రీలక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వార్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతలు విస్తృత ప్రచారం

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు శుక్రవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. రాష్ట్రాభివృద్ధికి సంక్షేమ పథకాల కొనసాగించడానికి వైఎస్సార్ సీపీ అభ్యర్థులైన కొత్తపేట ఎమ్మెల్యే అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి, ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాద్‌కు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. టీడీపీ నేతల మాయమాటలను నమ్మి మరోసారి మోసపోవద్దని వివరించారు. అమలు కాని హామీలను ఇచ్చి ప్రజలను టీడీపీ ఏమార్చుతుందని విమర్శించారు. ఆయా గ్రామాల్లో ప్రజల నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణుల ప్రచారానికి విశేష స్పందన లభించింది.

రాజోలు ఎన్నికలు హోరాహోరీ

- ప్రతి ఎన్నికల్లో ప్రత్యేకత చాటుకునే రాజోలు ఓటర్లు
- సంక్షేమం, అభివృద్ధితో ముందున్న వైఎస్సార్ సీపీ
- ప్రజల్లోకి వెళ్లేందుకే సతమతమైన కూటమి అభ్యర్థి



ప్రచారం చేస్తున్న రాజోలు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు

మలికిపురం: తన విలక్షణమైన తీర్పుతో రాష్ట్ర స్థాయిలోనే ప్రత్యేకతను చాటుకుంటున్న రాజోలు నియోజక వర్గంలోని ఓటర్లు ఈ సారి ఇచ్చే తీర్పు ఎలా ఉండబోతోందనే ఆసక్తి అంతటా నెలకొంది. మరో రెండు రోజుల్లో పోలింగ్ జరుగుతుండగా ఇక్కడ ప్రధానంగా వైఎస్సార్ సీపీ, కూటమి అభ్యర్థుల మధ్యే పోటీ నెలకొంది. ఈ సారి ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికలో కూడా ప్రధాన పార్టీలో చివరి నిమిషంలో అందరికీ ట్విస్ట్ ఇచ్చాయి. ఆది నుంచీ అనుకుంటుంటున్న వ్యక్తులకు కాకుండా అనూహ్యంగా కొత్త వ్యక్తులు ఆయా పార్టీల తరఫున రంగంలో దిగారు. ప్రధానంగా టీడీపీ నుంచి పార్టీ టికెట్ దక్కకపోదంతో అనూహ్యంగా ఆ పార్టీ రాజోలు ఇన్‌చార్జి, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు వైఎస్సార్ సీపీలో చేరారు. గత 30 ఏళ్లుగా రాజకీయ అనుభవం ఉన్న సూర్యారావును సీఎం జగన్ రాజోలు వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా అవకాశం ఇచ్చారు. స్వతహాగా సౌమ్యుడు అయిన గొల్లపల్లికి రాజోలు నియోజకవర్గంలో బంధుత్వంతో పాటు చక్కని పరిచయాలు ఉన్నాయి. గతంలో కూడా ఇక్కడ ఎమ్మెల్యేగా పని చేసిన సూర్యారావు ప్రస్తుతం ఎన్నికల ప్రచారంలో ముందున్నారు.

మొక్కవోని ధైర్యంతో..

గత ఐదేళ్లుగా సీఎం జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాలు నియోజక వర్గంలో పార్టీని అగ్రస్థానంలో నిలబెట్టాయి. గత రెండు ఎన్నికల్లోనూ ఇక్కడ పార్టీ పరాజయం చెందినప్పటికీ నియోజక వర్గంలో పార్టీ శ్రేణులు చెక్కు చెదరకుండా మొక్కవోని ధైర్యంతో పార్టీకి అండగా నిలిచారు. అంతేకాక జనసేన నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన రాపాకవర ప్రసాదరావు సీఎం జగన్ చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై వైఎస్సార్ సీపీలో చేరడం. వైఎస్సార్ సీపీ అమలాపురం పార్లమెంట్ ఎంపి అభ్యర్థిగా బరిలో ఉండడం పార్టీకి కలిసి వచ్చే ప్రధాన అంశాలు. ఓ వైపు రాపాక, మరో వైపు గొల్లపల్లి సూర్యారావులు చక్కని సమన్వయంతో ప్రచారం చేస్తున్నారు. అలాగే పార్టీ కేడర్ కూడా నియోజక వర్గంలో ఈ సారి వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయాలన్న సంకల్పంతో ముందుకు సాగుతుంది. మరోవైపు గత ఎన్నికలలో వైఎస్సార్ సీపీ తరఫున పోటీ చేసి ఓటమి చెందిన బొంతు రాజేశ్వరరావు ఏడాది క్రితం జనసేనలో చేరినా ఎన్నికల ముందు తిరిగి వైఎస్సార్ సీపీలో చేరి పార్టీ కోసం పని చేస్తున్నారు. నియోజకవర్గంలో బలమైన సామాజిక వర్గాల మద్దతు వైఎస్సార్ సీపీకే ఉండడం, ఆ సామాజిక వర్గాల్లో జగన్ అందిస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను అందుకుంటున్న మహిళల ఓట్లు అధికంగా ఈ సారి వైఎస్సార్ సీపీకే పడే అవకాశం ఉండడం కూడా కలిసి వచ్చే అంశాలు.

వశిష్ఠ వంతెనకు ప్రాధాన్యం

రాజోలు నియోజక వర్గ అభివృద్ధిలో కీలక భాగమైన సఖినేటిపల్లి-నర్సాపురం వంతెన నిర్మాణానికి సీఎం జగన్ అధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఇక్కడ వంతెన ఆకాంక్ష దాదాపు వందేళ్ల నాటిది. గత టీడీపీలో ఇద్దరు ముఖ్యమంత్రులు ఏకంగా మూడు సార్లు భూమి పూజ చేసినా పనులు ప్రారంభం కాలేదు. అయితే వైఎస్సార్ సీపీ అధికారంలోనికి వచ్చాక శంకుస్థాపన చేయకుండానే పనులు ప్రారంభించిడం విశేషం. గత ప్రతిపాదనల కంటే మెరుగ్గా ఏకంగా జాతీయ రహదారి రాజోలు నియోజక వర్గంలో ప్రధాన మండలాలైన సఖినేటిపల్లి, మలికిపురం మండలాల మీదుగా బైపాస్ రహదారిగా అభివృద్ధి చేసి రాజుల్లంక- రామేశ్వరం మధ్య వంతెన నిర్మాణానికి పూనుకుంది. సీఎం జగన్ కేంద్రం ద్వారా ఏకంగా రూ.580 కోట్ల నిధులు మంజూరు చేయించారు. టెండర్లు కూడా పిలిచారు. టెండర్లు ఓపెన్ చేసి పనులు పూర్తి స్థాయిలో ప్రారంభించవలసి ఉంది. ఈ లోగా ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ఆలస్యమయింది. 38 హెక్టార్ల భూసేకరణ జరిగి భూ యజమానులకు పరిహారం కూడా రూ.100 కోట్ల వరకూ చెల్లింపులు పూర్తయ్యాయి.

అడకత్తెరలో పోకచెక్కలా కూటమి అభ్యర్థి

రాజోలు నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా మారింది. అసలే నియోజకవర్గానికి కొత్త కావడం, ఇక్కడ టీడీపీ కూడా బలంగా ఉన్నప్పటికీ అభ్యర్థి ఎంపికలో ప్రాధాన్యం ఇవ్వలేదనే నిరాశ టీడీపీలో ఉంది. జనసేనలోనే పరిచయాలు అంతగా లేని జనసేన అభ్యర్థి టీడీపీ నేతల్లో కూడా తెలియకపోవడం అభ్యర్థి దేవ వరప్రసాద్‌కు మైనస్. ఇక జనసేనలో ఎవరికి వారే నాయకులుగా చలామణి కావడం ఇప్పటికీ సమన్వయం లేక పోవడం కూడా ఆ పార్టీకి ఇబ్బందిగా మారింది. గత టీడీపీ హయాంలో ఇచ్చిన హామీలే నెరవేర్చక ఇప్పుడు అమలు సాధ్యం కాని హామీలతో ప్రజలోనికి ఎలా వెళ్లాలో అర్థం కాక కూటమి శ్రేణులు సతమతం అవుతున్నాయి.